క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొనాలని సూచించారు.

మడకశిర కొండపై కోలాహలం



కొండ పైకి వెళ్లే వారికి సాయం చేస్తున్న పర్వతా రోహకుడు ఈశ్వర్

మడకశిర: మడకశిర కొండపై గురువారం కోలాహలం నెలకొంది. ఉగాది పండుగ సందర్భంగా యువతీయువకులు సరదాగా కొండపై ఉన్న సింగేమూతి కట్టడాన్ని చేసేందుకు పోటీ పడ్డారు. కొంతమంది కొండను అధిరోహించడానికి ఇబ్బందులు పడుతుండటంతో మడకశిరకు చెందిన పర్వతా రోహకుడు ఈశ్వర్ తోడ్పాటు అందించారు. కాగా.. ఇటీవల సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని ఈశ్వర్ విజయవంతంగా అధిరోహించిన విషయం తెలిసిందే.

అన్నదాన సత్రానికి విరాళం

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రం నిర్వహణకు సర్పంచ్ ఆదినారాయణ, ఆయన సోదరుడు నరసింహులు రూ.20,222 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటి సభ్యులు దాతలను సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వికలాంగులకు వైద్య పరీక్షలు

మడకశిర: మడకశిరలోని భవిత కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గంలోని వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు. 6-16 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న చెవులు వినబడని వారికి, పూర్తిగా నడవలేని వారికి వీల్ చైర్లు, వినికిడి మిషన్లు పంపిణీ చేయడానికి వీలుగా ఈ పరీక్షలు జరుపుతామన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని కాపుచెన్నంపల్లి సమీపంలోని పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4,500 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తాం



ప్రచారం చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

పావగడ: స్థానిక విధానసభ క్షేత్రం ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి ఎన్ రామాంజినప్ప గురువారం బీకే హళ్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేడీఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల పరిపాలనలో విఫలమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని తాలూకా ప్రజలను కోరారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో అవినీతి రహిత పాలనను అందిస్తామన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు గోపాల్, నాగేంద్ర, హనుమరెడ్డి, బాల చంద్ర,అజయ్, దీపిక, గౌతమ్, తావరె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌లో చేరిక..

పావగడ: వైఎన్ హొసకోటకు చెందిన 20 మంది ముస్లిం నాయకులు గురువారం జేడీఎస్‌లో చేరారు. నగర యువ విభాగం అధ్యక్షుడు ఇదయతుల్లా ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి జేడీఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోండి

గోరంట్ల: రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సుబ్బరాయుడు అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి సమయంలో ప్రార్థనలు ముగిసిన వెంటనే రోడ్లపై ఉండరాదన్నారు. రోడ్లపై తిరిగి వీధి లైట్లు ధ్వంసం చేస్తే చర్యలు తప్పవన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

చిలమత్తూరు: ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం వీరాపురం, వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మట్కా, పేకాట ఆడే వారిపై నిఘా ఉంచామని తెలిపారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



గోరంట్ల: గుమ్మయ్యగారిపల్లిలో మారేమ్మ దేవతకు జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు



రొళ్ల: అలంకరణలో దొడ్డీరమ్మ



రొళ్ల: ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు



అమరాపురం: కెంకెరలో మారెక్క దేవిని ఊరేగిస్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామ సమీపాన వెలసిన దొడ్డీరమ్మ దేవికి గురువారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. దీంతో ఒక రోజు ముందే ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. తర్వాత ఉదయాన్నే అమ్మవారిని అభిషేకించారు. అనంతరం పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి, మహామంగళ హారతి ఇచ్చారు. దొడ్డేరి, కొత్తపల్లి, పిల్లిగుండ్ల, రంగనపల్లి, వెంకటంపల్లితో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు కమిటీ ద్వారా అన్నదానంతో పాటు పానకం, మజ్జిగ అందజేశారు. ఆలయ అర్చకుడు భక్తులకు ప్రసాదం అందజేశారు.

మారెక్క దేవికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని కెంకెర గ్రామంలో మారెక్క దేవిని ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగించారు. గురువారం ఉదయం వలస మారెక్క దేవిని గ్రామంలోకి తీసుకొచ్చి గ్రామ నడిబొడ్డున కూర్చొబెట్టిన భక్తులు వివిధ రకాల పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

గుమ్మయ్యగారిపల్లిలో జోతుల ప్రదర్శన

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి గ్రామంలో గురువారం సత్యదేవత మారెమ్మకు భక్తిశ్రద్ధలతో జ్యోతులను ఊరేగించారు. మహిళలు జ్యోతులను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దేవిరాజు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులు జోతుల ప్రదర్శనలో పాల్గొన్న దాదాపు 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారేమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం, మక్కాజిపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల వాడకంపై గురువారం అవగాహన కల్పించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈనెల 20వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలును గుర్తించి సరైన వైద్య సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. చిరుధాన్యాలైన పెసలు, మినుములు, సజ్జలు, కొర్రలు, రాగులు, జొన్నల వాడకం, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూజాత పాల్గొన్నారు.

టాటా ఏస్ డ్రైవర్‌పై కేసు నమోదు

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ వడ్రహట్టి క్రాస్ కల్వర్టు మలుపు వద్ద ఈనెల 14వ తేదీన రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చర్లోపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు గొడప్ప, సన్నరంగమ్మ తీవ్రంగా గాయపడిన విషయం తెలసిందే. ఈ ప్రమాదానికి కారణమైన టాటా ఏస్ వాహనాన్ని అదే రోజు రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకుని రొళ్ల స్టేషన్‌కు తరలించారు. అయితే డ్రైవర్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. గాయపడిన భార్యాభర్తలు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక ప్రాంతం పావగడ తాలూకా బొమ్మతానహళ్లి గ్రామానికి చెందిన రఫీక్‌గా గుర్తించి, కేసు నమోదు చేయడం జరిగిందని ఏఎస్ఐ బాలాజీ తెలిపారు. త్వరలోనే డ్రైవర్ రఫీక్‌ను అరెస్ట్ చేసి మడకశిర కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు

హిందూపురం: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ యోగనందకు మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం వినతిపత్రాలు అందజేశారు. పట్టణ పరిధిలోని పలుచోట్ల స్థలాలు ఆక్రమణలు, కబ్జాలకు గురి అవుతున్నాయని వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే చాలాచోట్ల రిజర్వ్‌డ్ స్థలాలు సైతం వదలడం లేదన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటంతో కౌన్సిలర్లు తమ వంతు బాధ్యతగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణదారులు ప్రజాప్రతినిధులకు చెడ్డ పేరు తీసుకువచ్చేలా ఇలాంటి అక్రమణలకు పాల్పడుతూ పబ్బంగం గడుపుకుంటున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తాము కౌన్సిల్ సమావేశంలోనూ చర్చించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, ఆసిఫ్ వుల్లా, ఆయుబ్, రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, దాదు, చంద్రశేఖర్, డాక్టర్ బాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వారపు సంత వేలం

చిలమత్తూరు:మండల కేంద్రంలో నిర్వహించే వారపుసంతకు ఈనెల 25న వేలంపాట నిర్వహించనున్నట్టు కార్యదర్శి నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సర్పంచ్ అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. అదే విధంగా బస్టాండ్‌కు రూ.50 వేలు, జంతువధ శాలకు రూ.3 వేలు, షాపింగ్ కాంప్లెక్స్ రూములు జనరల్‌కు రూ.50 వేలు, షెడ్యూల్ తెగల వారు రూ.10 వేల దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొలన్నారు. దరావత్తుతో పాటు ఆస్తి మదింపు సర్టిఫికెట్లు అందజేయాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జేడీఎస్ నాయకులు



జేడీఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: స్థానిక మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జేడీఎస్ అభ్యర్థి కేఎం తిమ్మరాయప్ప స్వగ్రామం కేటి హళ్లిలో జేడీఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున, బోరనాయక, నారాయణప్ప, దేవలకెరె తిప్పేస్వామి, మాద నాయక, కరియణ్ణ, ప్రేమ్ కుమార్ తదితరులు గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప, స్థానిక విధాన సభ క్షేత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ వారికి పార్టీ కండువాలు వేసి, కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణప్ప మాట్లాడుతూ.. తన హయాంలో తాలూకా వ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. తుంగభద్ర నీటి యోజన, వంద కోట్ల నిధులతో తారు రోడ్ల నిర్మాణం, పావగడ మీదుగా రాయదుర్గం–తుమకూరు రైల్వే మార్గం, పాఠశాలలు, కళాశాలలకు భవనాల నిర్మాణం, ప్రతి సామాజిక వర్గానికి సముదాయ భవనాల నిర్మాణం, జేజేఎం పథకం నుంచి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగు నీటి సరఫరా పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు హెచ్‌వీ వెంకటేశ్‌ను మెజారిటీతో గెలిపించాలని కోరారు.

క్రమశిక్షణతో చదువుకోండి



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన దృశ్యం

మడకశిర రూరల్: మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి పాపసానిపల్లి జిల్లా ఉన్నత పాఠశాలకు వస్తున్న 26 మంది విద్యార్థులకు గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ఆర్డీటీ అందించే సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ రీసోర్స్ అసోసియేట్ రామ్ ప్రతాపరెడ్డి, హెచ్‌ఎం వెంకటరమణనాయక్, ఏటీఎల్ నారాయణస్వామి, ఎస్టీఎల్ కృష్ణయ్య, సీఓ రాయుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నంజరెడ్డి పాల్గొన్నారు.

ఓటు వేసిన ఎమ్మెల్యే



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: అమరావతిలోని అసెంబ్లీ భవనంలో గురువారం జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఓటుహక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులందరూ ఘన విజయం సాధిస్తారని ఫోన్‌లో తెలిపారు. బలం లేకపోయినా టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీ తరపున అభ్యర్థిని రంగంలోకి దింపారని తెలిపారు. చంద్రబాబు ఇలాంటి నీతిలేని రాజకీయాలు చేయడంలో దిట్ట అని విమర్శించారు.

సచివాలయం తనిఖీ

గోరంట్ల: మండల పరిధిలోని మల్లాపల్లి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా పొడి, తడి చెత్త వేరు చేయడంపై క్లాప్‌మిత్రులకు సూచనలిచ్చారు. అనంతరం సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మల్లాపల్లి సర్పంచ్ శివనంద పాల్గొన్నారు.

నేత్రదానం



నేత్రదానం చేసిన క్రిష్టప్ప (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని రాగిమేకులపల్లి గ్రామానికి చెందిన సి.క్రిష్టప్ప (50) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేసినట్లు సాయి ట్రస్ట్ సభ్యులు గురువారం తెలిపారు. ఇటీవల క్రిష్టప్ప అనారోగ్యంతో ఓ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి చెందిన ఆప్తమాలిక్ అసిస్టెంట్ శ్రీకాంత్ బాధిత కుటుంబ సభ్యులకు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. వారి అంగీకారంతో క్రిష్టప్ప నేత్రాలను సేకరించారు.

వృద్ధుడికి గాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి గ్రామానికి దసరి నారాయణప్ప (63) అనే వృద్ధుడు గురువారం రాత్రి మిద్దె పై నుంచి కాలుజారి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణప్పను 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

పురంలో డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే తీరును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గురువారం హిందూపురం మున్సిపాలిటీలోని కొట్నూరు వద్ద డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ సర్వే తీరును మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ ఇంద్రజ అధికారులు పరిశీలించారు. కంప్యూటర్ ద్వారా గూగుల్ మ్యాపింగ్ క్షేత్రస్థాయి స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూసర్వే ప్రారంభించారన్నారు. ఇది చరిత్రలో మైలురాయి అన్నారు. భవిష్యత్తులో భూ సమస్యలకు తావులేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి రెహెమాన్, కౌన్సిలర్లు రామచంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మడకశిర/అమరాపురం: నియోజకవర్గంలోని 6 కేంద్రాల్లో గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి. మొత్తం 1,319 విద్యార్థులకు గాను 1,267 మంది విద్యార్థులు హాజరయ్యారు. 52 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మడకశిర జూనియర్ కళాశాలలో 368 మందికి గాను 350 మంది హాజరు కాగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 248 మందికి గాను 234 మంది హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 205 మంది హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. అగళిలో 134 మందికి గాను 133 మంది హాజరయ్యారు. ఒకరు పరీక్షలకు గైర్హాజరయ్యారు. అమరాపురంలో 186 మందికి గాను 181 మంది హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు హాజరు కాలేదు. గుడిబండలో 172 మందికి గాను 164 మంది హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీలో ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. గురువారం ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్, హిస్టరీ, జువాలజీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 236 మంది హాజరుకావాల్సి ఉండగా.. 234 మంది పరీక్షలకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఇద్దరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హరేసముద్రం–2, గౌడనహళ్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ రెండు పోస్టులను బీసీ జనరల్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 27లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 13 వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరాపురం–1 గ్రామ సచివాలయంలో ఓసీ (మహిళ), హేమావతి–2 సచివాలయ పరిధిలో 2 పోస్టులు (బీసీ–డీ పురుషులు) కె.శివరం–1 సచివాలయ పరిధిలో 1 (బీసీ–డీ పురుషుడు), తమ్మడేపల్లి–2 సచివాలయంలో 2 పోస్టులు ఉండగా.. ఎస్సీ–1 (మహిళ), బీసీ–డీ–1 (పురుషుడు), వలస సచివాలయంలో 3 పోస్టులు ఉండగా.. ఎస్సీ–2 (పురుషులు), ఓసీ–1 (మహిళ), వి.అగ్రహారం సచివాలయంలో 3 పోస్టులు ఉండగా.. ఎస్సీ–1 (పురుషుడు), బీసీ–బీ–2 (మహిళ), హలుకూరు సచివాలయంలో బీసీ–డీ, (పురుషుడు) 1 చొప్పున మొత్తం 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని

చిలమత్తూరు: మండలంలో వివిధ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన విడుదల చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. చిలమత్తూరు–1లో 2, చిలమత్తూరు–3లో 1, వీరాపురంలో 1 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉండి అర్హులైన వారు ఈనెల 24 నుంచి 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

గోరంట్ల: కర్ణాటక రాష్ట్రం పెసలపర్తి గ్రామంలోని మద్యం షాపు నుంచి అక్రమంగా ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తున్న మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి గ్రామానికి దొమ్మర నరసింహప్ప, అతడి భార్య నాగరత్నమ్మను గురువారం పులేరు సమీపంలో అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. అదే విధంగా రాంపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా కొండాపురం క్రాస్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 480 హైవార్డ్ చీర్స్ 90 ఎంఎల్ టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మద్యం తరలించడానికి వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి పెనుకొండ కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

ఇరువర్గాల ఘర్షణ

హిందూపురం: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద గురువారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాలు.. ఉగాది పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం అంబేడ్కర్ నగర్‌లో కొందరు యువకులు రంగులు చల్లుకున్నారు. కాలనీలో ఆడుకోండి రోడ్లపైకి ఇటుగా రావద్దని అక్కడి వారు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదికాస్తా ఘర్షణకు దారితీయడంతో రాళ్లు రువ్వుకున్నారు. ఈ గొడవలో హరిష్, చింటూతో పాటు మరొకరి తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని వెంటనే టూటౌన్ పోలీసులు అక్కడి చేరుకుని గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గొడవకు కారణమైన ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు పిలిచి విచారణ చేస్తున్నారు.

పోరాటయోధుడు 'భగత్‌సింగ్'



భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ: భారతదేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ భగత్ సింగ్ అని ఎమ్మెల్సీ మంగమ్మ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మిట్టాంజనేయస్వామి దేవాలయం వద్ద భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకులు దేశాన్ని నిరంకుశత్వంగా పాలిస్తున్న సమయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి విగ్రహాలకు ట్రస్టుకు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ హుస్సేన్ పీరా, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి, బొక్సంపల్లి, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, కౌన్సిలర్ శేషాద్రి, బోయ బాబు, మిట్టాంజనేయస్వామి అభివృద్ధి సంస్థ చైర్మన్ జంపు శ్రీనివాసులు శ్రీకృష్ణదేవరాయ క్రికెట్ అసోసియేషన్ మిత్ర బృందం బిన్ని, ధనుంజయ, నంజుండ, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. క్యాక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, నారాయణ స్వామి, రంగప్ప పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: భరతమాత ముద్దుబిడ్డలైన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహమూర్తి, వేణుగోపాల్, దేవరాజ్, దినేష్, వరుణ్, గోపాల్, పవన్ పాల్గొన్నారు.